## చిరంజీవ! చిరంజీవ!!

ప్లేన్ రన్‌వేలో వేగంగా వెడుతూ పైకి లేస్తున్నప్పుడు, సీతాపతి చేతిని గట్టిగా పట్టుకుని, "మనం చేస్తున్నపని మంచిదేనంటారా?" అని అడిగింది సీత, అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

క్రింద కనపడుతున్న టెక్సాస్‌లోని డల్లాస్ సిటీ అందాలను కిటికీలో నించి చూస్తున్న సీతాపతి "ఏదీ! ప్లేన్‌లో ఎక్కటమా? " అన్నాడు నవ్వుతూ.

"మీ మొఖం! నేను అడిగేది మనం పూనా వెళ్ళి ఒక పాపను పెంచుకోవటం గురించి! " అన్నది సీత – పెదిమల మీద చిరునవ్వుతో.

ఆల్చిప్పలంత ఆ పెద్దకళ్ళల్లో చిన్నముత్యమంత ఆందోళన చూసిన సీతాపతి, ఒక చిన్ననవ్వు నవ్వి "మనమెంతో ఆలోచించి తర్జనభర్జన చేసి తీసుకున్ననిర్ణయం ఇది. కనుక మనం చేస్తున్నపని గ్యారంటీగా మంచిది. నువ్వు అనవసరంగా గాబరా పడకు" అన్నాడు.

"అదికాదు. మన జీవితంలో ఇదొక పెద్ద నిర్ణయం. మన జీవితాన్ని జీవన విధానాన్ని పూర్తిగా మార్చివేసే నిర్ణయం. అందుకే అంటున్నాను..." అన్నది సీత.

సీతాపతి ఆమె భుజంమీద చేయివేసి దగ్గరకు తీసుకున్నాడు.

సీతకు రెండు జడలు లేవు. అసలు ఒక జడకూడా లేదు, జుట్టు భుజాల దాకా కత్తిరించుకుంటుంది కదా అందుకని. కళ్ళజోడు సవరించుకుని సీత అందాలని చూస్తున్న సీతాపతికి, ఆ నాలుగు కళ్ళూ చాలటం లేదు. ఆమె కొంచెం అటూ ఇటూ కదిలి, అతన్ని ఆనుకుని ఆలోచిస్తున్నది.

సీతా, సీతాపతీ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, ఆర్లింగ్‌టన్‌లో ఫిజిక్స్‌లో పి.హెచ్.డీలు చేస్తూ, ప్రేమలో కూడా పి.హెచ్.డీ. చేస్తే ఎలా వుంటుందా

అని అనుకున్నారు. ఎలాగూ అనుకున్నాం కదా, అని ప్రేమలో పి.హెచ్.డీ. చేయటం మొదలుబెట్టి, అది పూర్తవకుండానే నిజంగానే ప్రేమలో పడిపోయారు. సరే ఎలాగూ ప్రేమలో పడిపోయాం కదా, పెళ్ళి చేసుకుంటే పోలా అని పెళ్ళి చేసుకున్నారు. ఇటు ప్రేమలోనూ, అటు ఫిజిక్స్‌లోనూ పి.హెచ్.డీ. పూర్తవగానే, ఇద్దరకీ అదే యూనివర్సిటీ లో రీశెర్చి చేసే ఉద్యోగం దొరికింది. ఇటు ఉద్యోగంలోనూ, అటు సంసార జీవితంతో నూ ఇద్దరూ బాగా బిజీ అయిపోయి, నాలుగేళ్ళు ఆ హడావిడిలోనే సరదాగానూ, ఆ సరదాలోనే హడావిడిగానూ గడిపేశారు. అలా గడిపేస్తున్నప్పుడు అర్థమయింది, తమ కొక చక్కటి కూతురు కావాలనుకున్నా, ఆ ఛాయలేమీ కనపడటం లేదని.

"నాలో ఏదన్నా లోపం వుందేమో" అంది సీత కొంచెం బాధ పడుతూ.

"నీ లోనే లోపం అని ఎందుకు అనుకుంటున్నావ్. నాలో వుందేమో!" అన్నాడు సీతాపతి అస్సలు బాధ పడకుండా.

ఇద్దరూ కాసేపు వాదించుకున్నారు. కానీ ఇద్దరిదీ ఎదుటివారిని ఇబ్బందిపెట్టే స్వభావం కాదు. అందుకే ఆ వాదులాటలో ఎవరూ గెలవలేదు. ఎవరూ ఓడిపోలేదు కూడాను. ఇద్దరూ కలిసి, పెద్దమనసులు వున్నాయి కనుక, ఒక చక్కటి నిర్ణయం తీసుకున్నారు.

"మనిద్దరం పరీక్షలు చేయించుకుని, ఎవరిలో ఆ లోపం వుందో తెలుసుకోవటం అనవసరం. సో దటీజ్ రూల్డవుట్. మరి మనకో రాజకుమారి కావాలి" అని నిర్ణయానికి వచ్చి, ఆ రాజకుమారిని పొందటం ఎలా అని మళ్ళీ వాదించుకున్నారు. ఎవరైనా తెలిసిన వాళ్ళ పిల్లనో, బంధువుల పిల్లనో పెంచుకుంటే?

మంచంమీద పడుకుని పైన తిరుగుతున్న సీలింగ్ ఫాన్‌ని చూస్తున్నాడు సీతాపతి. అతని గుండెల మీద తల ఆన్చి పడుకుని, అతని హృదయం చెబుతున్న కబుర్లు వింటున్నసీత, "హా! తెలిసెన్" అన్నట్టుగా ఒక తీయటి చిరునవ్వు నవ్వి "అవును. నేనూ మీరనుకుంటున్న దానికి ఒప్పుకుంటున్నాను" అన్నది.

సీతాపతి ఉలిక్కిపడి "నేను ఏమీ అనలేదే. కొంపతీసి గురక పెట్టలేదు కదా" అన్నాడు.

సీత గలగలా నవ్వి "అవును గురకే. నీ గుండె పెట్టిన గురక. ఆత్రేయగారు అన్నారు కదా, ఎదలోని సొదలన్నీ ఇనుకో అని. అదే విన్నాను నేను. సారథి కమలా వాళ్ళు, ఇండియా వెళ్ళి అనాధాశ్రమంనించీ ఒక చక్కటి పాపనితెచ్చుకుని పెంచుకుంటున్నారు కదా. మనమూ అలానే చేస్తే... " అన్నది.

"అరెరె! నిజంగానే నీకు తెలిసిపోయింది నా గురకమ్యూనికేషన్" నవ్వాడు

సీతాపతి. నవ్వి, సీత తల మీద చేయి వేసి, సుతారంగా ఆమె జుట్టు నిమురుతూ సాలోచ నగా అన్నాడు.

"అవును సీతా. మొన్న ఇంటర్నెట్లో ఒక ఆర్టికిల్ చదివి చలించిపోయాను. ఈ ప్రపంచంలో ఎంతోమంది పిల్లలు అనాథలుగా బ్రతుకుతున్నారు. చాలమందికి బొమ్మ అన్న మాటకి అర్థం తెలీదు. ఎంతోమందికి బొమ్మ కాదు, అమ్మ అన్నమాటకి కూడా అర్థం తెలీదని చదివాక చాల బాధ వేసింది"

సీతాపతి ఆమాటలు అంటున్నప్పుడు, అతని గుండెల మీద సేద తీర్చుకుంటు న్న సీత చెవిలో, వెయ్యి వయొలిన్ల మీద విషాదగీతాలు వాయించినట్టుగా వుంది.

"ఆ ఆర్టికిల్ నేనూ చదివాను. అప్పటినించీ నేనూ అదే ఆలోచిస్తున్నాను. అంతకన్నా మంచి పని ఇంకోటి వుంటుందని నేను అనుకోను" అన్నది సీత.

అలా వచ్చిన ఆ ఆలోచన, సీత కమలకి ఫోన్ చేసి అన్ని వివరాలూ కనుక్కోవ టంతో, కార్య రూపం దాల్చింది.

ఆ వివరాలు అందిన వెంటనే సీతాపతి, ఇండియాలో పూనాలో వున్న ఆ సంస్థ కి ఫోన్ చేసి ప్రొసీజర్ అంతా తెలుసుకున్నాడు. ఆ స్వచ్ఛంద సంస్థ ఇండియా, అమె రికాలలోని భారతీయులకే కాక, అమెరికన్లకి మిగతా విదేశీయులకీ కూడా చాల మంది అనాధ పిల్లల్ని పెంచుకోవటంలో సహాయపడింది. అమెరికాలో వాళ్ళకి కొంతమంది ట్రైయిన్‌నింగయిన సోషల్ వర్కర్స్ వాలంటీర్లుగా వున్నారు. వాళ్ళు ఇంటికి వచ్చి, సీతా సీతాపతిల జీవన విధానాన్నీ ఆస్థిపాస్తుల్నీ, అలా పిల్లల్ని తీసుకు వస్తే సరిగ్గా పెంచగల రా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించి, ఒక రిపోర్టు వ్రాసి ఇండియాలోని ఆ సంస్థకి పంపిం చారు.

సీత, సీతాపతి ఒకటికి పదిసార్లు ఇండియాకి ఫోన్ చేసి, తమకి కావలసిన సమాచారం సేకరించాక, ఇండియాకి ప్రయాణం కట్టారు. వాళ్ళకి నచ్చిన ఒక పాపను చూసి దత్తత తీసుకుని, అమెరికాలోని ఇమ్మిగ్రేషన్ అండ్ నేచ్యురలైజేషన్ సర్వీసెస్‌కి వీసాకోసం అప్లై చేయటం తర్వాతి పని.

తను ఒక తల్లినవుతున్నందుకు సంతోషం ఒక పక్కా, ఆ కొత్త జీవితం ఎలా వుంటుందా అనే ఆందోళన ఇంకొక పక్కా, సీత ఆలోచనలని అల్లరి పెడుతుంటే, సీతా పతి ఆమె చేతిని గట్టిగా పట్టుకున్న తీరు, ఆమెకెంతో ధైర్యాన్నిస్తున్నది.

ఎయిర్ హోస్టెస్ ఇద్దరికీ, ఆరెంజ్ జ్యూస్ ఇచ్చి వెళ్ళేక అడిగాడు సీతాపతి.

"మనం ఇద్దరం అమ్మాయే కావాలని అనుకున్నాం కదా! ఇంకా అదేనా నిర్ణ యం. అబ్బాయి కావాలా?"

"నిజం చెప్పనా? నాకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి కావాలి" మనస్ఫూర్తిగా అంది సీత. మళ్ళీ తనే అంది "వద్దులే బాబూ. ఒకళ్ళు చాలు. మనిద్దరం మన జీవితాలని రీశెర్చికి అర్పణ చేశాం. చాల బిజీగా వుంటున్నాం. ఇద్దరు పిల్లల్ని పెంచటం మాటలు కాదు. అంత ఎటెన్షన్ మనం ఇవ్వలేనప్పుడు, ఇద్దరినీ సరిగ్గా పెంచలేం. అందుకని మన ప్రేమంతా, సమయమంతా ఒకళ్ళమీదే ఫోకస్‌చేస్తే బాగుంటుంది. ఏమంటావ్?"

"ఓకే. నో మోర్ డిస్కషన్ దెన్. మనం ఒక చక్కటి రాజకుమారిని తెచ్చుకుందాం. దటీజ్ ఫైనల్!" అన్నాడు సీతాపతి.

ముందుసీటులో కూర్చున్న చైనీసావిడ ఒళ్ళో పడుకున్న పసివాడు ఏడవటం మొదలుపెట్టాడు. సీత, సీతాపతి, ప్లేన్ ఎక్కే ముందర లౌంజ్‌లో వాళ్ళకి ఎదురుగానే కూర్చున్నారు. ఆ చైనీసావిడా, చైనీసాయనలకి మొదటి సంతానం కాబోలు, ఆ పసివాడితో అవస్థలు పడుతున్నారు. నాలుగైదు నెలల పిల్లాడేమో బొద్దుగా నున్నటి బుగ్గలతో, మెరుస్తున్న నల్లటి కళ్ళతో, నల్ల జుట్టుతో తెల్లగా ముద్దొస్తున్నాడు.

ఆ పిల్లాడి ఏడుపు ఇంకా పెద్దదయింది. ఆవిడా కుర్రాడ్ని ఒళ్ళో పడుకోబెట్టుకుని, చిచ్చికొడుతూ, వాడితో చైనీస్‌లో కబుర్లు చెబుతున్నది. వాడింకా చైనీస్ నేర్చుకోలేదేమో, అవేమీ పట్టించుకోకుండా ఆరున్నొక్క రాగంలో ఆరోహణం సాధన చేస్తున్నాడు. చుట్టుపక్కల వాళ్ళందరూ వాళ్ళనే చూస్తున్నారు.

సీతాపతి అన్నాడు "పిల్లల్ని పెంచటం తెలిసినట్టు లేదు" అని. అన్నతర్వాత, నాలిక కరుచుకుని సీత వేపు తిరిగి "అంటే మనకి తెలుసని కాదు" అని ఇంకా ఏమనాలో తెలీక, గుర్రుగా చూస్తున్న సీత వేపు ఇబ్బందిగా చూశాడు.

సీత నవ్వింది "అన్నీ అవే తెలుస్తాయి" అంది.

"ఎలా తెలుస్తాయి. ఎవరన్నా పెద్దవాళ్ళు దగ్గరుండి ట్రైనింగ్ ఇవ్వద్దూ"

సీత మళ్ళీ నవ్వింది. "కొన్ని విషయాల్లో నువ్వు చెప్పింది నిజమే కానీ అన్నిట్లోనూ కాదు. అనుభవం మీద అవే తెలుస్తాయి" అంది.

సీతాపతి ఆశ్చర్యం నటించి "అవును సుమా! నిజంగా నిజం" అన్నాడు సీత చెయ్యి చిలిపిగా నొక్కుతూ.

ఆ చైనీసాయన కుర్రాడ్ని భుజాన వేసుకుని ఈలపాట రఘురామయ్యలా అందరి చెవులకీ చిల్లులు పొడుస్తూ ఈల వేస్తున్నాడు. అవతల కూర్చున్న తెల్లాయన, ఎర్రగా చూస్తున్నాడు చెవులు మూసుకుని.

ఆ కుర్రాడు వాళ్ళ నాన్న భుజం మీద పడుకుని, ఏడుస్తూనే వెనక కూర్చున్న సీత వేపు చూస్తున్నాడు. సీత రెండు చేతులూ ఊపుతూ, వాడివేపు నవ్వుతూ

చూస్తూ, ఏవో సంజ్ఞలు చేస్తున్నది.

వాడు ఒక్కసారిగా ఏడుపు ఆపాడు. ఆపి సీతనే చూస్తున్నాడు. చూడటమే కాదు, ఓ నవ్వుకూడా పారేశాడు.

చైనీసాయన, తన ఈల పాటకే వాడు ఏడుపు ఆపాడనుకుని, మళ్ళీ ఇంకో పాట మొదలు పెట్టాడు. చైనీసావిడ కళ్ళతో వద్దని వారించింది ఆయన్ని.

సీతాపతి నిజంగా ఆశ్చర్యపోయి "ఏమిటి? ఏం చెప్పావా కుర్ర వెధవతో వాడు ఏడుపు ఠప్ మని ఆపేశాడు" అన్నాడు.

"వాడికా తెలుగు అర్ధం కాదు. మరి నాకేమో చైనీస్ రాదు. అందుకని సైన్ లాంగ్వేజ్‌లో చెప్పాను- ఏడుపు ఆపరా నాగన్నా, మీ నాన్న ఈలపాట వినలేక చస్తున్నాం అని. చింగ్ చాంగ్ మంచి బాలుడు. చెప్పిన మాట విని ఏడుపు వెంటనే మానేశాడు. అంతే!" అంది చిలిపిగా నవ్వుతూ.

సీతాపతి కూడా నవ్వి, సీత తల మీద సుతారాంగా ఒక మొట్టికాయ వేసి "ఛీ పాడుపిల్లా. నన్ను ఆట పట్టిస్తున్నావ్!" అన్నాడు.

మన కథలో తర్వాత సీను కోసం ఇండియా వెడదాం.

పూనాలో ఆ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్, శైలజా పాండే చిరునవ్వుతో వాళ్ళని ఆహ్వానించింది. ఆవిడ గదిలో అన్ని విషయాలు మాట్లాడుకున్న తర్వాత, లోపలి హాల్లోకి తీసుకు వెళ్ళింది. అక్కడ నెలరోజుల లోపు పసికందుల దగ్గర నించీ, నాలుగైదేళ్ళ వయసు పిల్లల దాకా వున్నారు. అందరూ శుభ్రంగానే వున్నా, వాళ్ళం దరిలోనూ ఒక విధమైన వెలితి స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఆహారం, వసతి వాళ్ళకి ఎంతో అవసరమైనా, అందుబాటులో వున్నా, అంతకన్నా ముఖ్యమైంది డబ్బుతో రాదు మరి. కొంచెం వయసొచ్చిన పిల్లలు,ఇలా అమెరికాలాటి విదేశాలనించి వచ్చిన వారిని వెంటనే గుర్తుపడతారు. వచ్చిన వాళ్ళు వచ్చేటప్పుడు ఒంటరిగానే వచ్చినా, వెళ్ళేట ప్పుడు వాళ్ళ స్నేహితులని తీసుకుపోతారు కనుక.

సీతా, సీతాపతీ లోపలికి వెళ్ళి, చాలమంది పసికందుల్ని చూశారు. కొందరు నిద్రపోతున్నారు. కొందరికి స్నానాలు చేయిస్తున్నారు. కొందరు పాలు తాగుతున్నారు. పాలు తాగుతున్నవాళ్ళల్లో ఒక పసిపాపని చూడగానే, సీత అక్కడేఆగిపోయింది. పాలబుగ్గలతో పసిడి బొమ్మలా వుంది. పాల సీసాని పక్కకు నెట్టి, ఒక బోసి నవ్వుని మెరుపు తీగలా కళ్ళముందు తళతళలాడించింది. పక్కనేవున్న సీతాపతి అంతా చూస్తూనే వున్నాడు. ఇద్దరూ శైలజా పాండే వెనకనే నడిచారు. అక్కడ హడావిడిగా వుంది. అక్కడ పనిచేసేవాళ్ళే కాకుండా కొంతమంది వాలంటీర్లుకూడా సహాయంచేస్తున్నారు.

అక్కడంతా చూసి, రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాక, శైలజా పాండే రకరకా ల పిల్లల వివరాలు, ఫొటోలతో సహా చూపించింది. అంతకు ముందు, సీతా, సీతాపతీ చెప్పిన వివరాలతో అవి సరిచూసుకుని, రెండు ఫైళ్ళు వాళ్ళముందు పెట్టింది. "ఈ ఇద్ద రినీ చూస్తారా?" అని అడిగింది. ఆ ఫొటోల్లో ఒకదాంట్లో ఇందాక చూసిన పాప కూడా వుండటంతో, సీతా సీతాపతీ ఒకేసారి సరే అన్నారు.

మొదటగా తీసుకొచ్చిన పిల్లకి ఎనిమిది నెలల వయసుంటుందేమో. లోతైన కళ్ళతో దీక్షగా చూస్తున్నది. ఏమాలోచిస్తున్నదో కానీ మధ్య మధ్యలో చిరునవ్వు నవ్వు తున్నది. ముద్దుగా బొద్దుగా వుంది. నోట్లో వేలేసుకుని చూస్తున్నది.

"ఎంత బాగుందో!" అంది సీత.

"అవును ఇందాక నన్ను చూసి అందంగా నవ్వింది కూడాను" అన్నాడు సీతా పతి నవ్వుతూ.

సీత ఆ పిల్లని చేతుల్లోకి తీసుకుని, సుతారంగా ఆ నున్నటి పాలబుగ్గల మీద చిన్నగా చిటికె వేసింది. ఆ పిల్ల తన బోసినోటిని తెరిచి, ఒక చిన్ననవ్వు నవ్వి మళ్ళీ నోట్లో వేలు వేసుకుంది. ఆ పిల్ల కళ్ళు పలకరిస్తున్నట్టుగా అందంగా మెరుస్తున్నాయి.

"ఈ పాప పేరు సమీర" అన్నది శైలజ.

"ఎంత అందంగా వుందో, అంత అందమైన పేరు" అన్నది సీత, తన చిటికెన వేలిని గుప్పిటతో పట్టుకున్న సమీరని ప్రేమగా చూస్తూ.

సమీరని ఒళ్ళో పడుకోబెట్టుకుని ముద్దాడుతున్న సీతని అలా చూస్తుంటే సీతా పతికి విచిత్రంగా వుంది.

"సీత ఎంత నిండుగా వుంది" అనుకున్నాడు.

అలా అనుకుంటూనే, "సమీరలో నీ పోలికలు బాగా కనిపిస్తున్నాయి" అన్నా డు.

సీత నవ్వి "భలే చెప్పావే సీతాపతీ! అచ్చం రీశెర్చి సైంటిస్టులా!" అంది.

ఈలోగా, రెండో పాపాయిని తీసుకు వచ్చింది ఒక వాలంటీర్. ఆ పిల్లే సీతను చూసి బోసినవ్వుల రతనాలు చిందించిన పసిడి బొమ్మ.

మూతలు పడుతున్నతన పెద్ద పెద్ద కళ్ళను అటూ ఇటూ తిప్పుతూ, అక్కడి మనుష్యుల్నీ, పైన తిరుగుతున్నఫాన్‌నీ చూస్తున్నది. ఇంతలోనే నిద్రలోకిజారుకుంటు న్నది. ఆ నిద్రలోనే, ఏం గుర్తొస్తున్నదో కానీ, మధ్యమధ్యలో చిరుదరహాసాలు చిందిస్తు న్నది. నల్లటి జుట్టు అప్పుడే ఒత్తుగా చెవులని కప్పుతూ అందంగావుంది. ఎత్తైన నున్నటి బుగ్గలు కిటికీలోనించీ పడుతున్న సన్నటిసూర్యకాంతిలో పచ్చగా మెరుస్తున్నాయి.

"ఆ పాల బుగ్గల మీద నవ్వితే అందంగా సొట్టలు పడుతున్నాయి చూశావా! షి ఈజ్ స్వీట్" అన్నాడు సీతాపతి.

"చాల బాగుంది కదూ" అంది సీత.

"అవును. ఎంతో ముద్దొస్తున్నది" అన్నాడు సీతాపతి, ఆ పిల్లని జాగ్రత్తగా తన చేతుల్లోకి తీసుకుంటూ.

"బి కేర్ ఫుల్" అంటూ మొదటిసారిగా పసిపాపని ఎత్తుకుంటున్న సీతాపతిని గోముగ్గా చూసింది సీత.

సీతాపతి ఆ పిల్లని రెండు చేతులమధ్యా ఎంతో జాగ్రత్తగా పట్టుకుని,తన పొట్ట కి ఆనించుకున్నాడు. ఆ అమ్మాయి అతన్ని చూసి చిరునవ్వులు ఒలకబోస్తున్నది.

"జాగ్రత్త" అంది సీత అతనితో.

"తెలుసులేవోయ్! నాకా మాత్రం తెలీదా?" అని ముక్కు చిట్లించి, ఆ పసికం దు ముఖంలోకి చూసి చీచీ అన్నాడు సీతాపతి.

ఆ పిల్ల గుప్పిళ్ళు బిగించి చేతులాడించింది, కవికోకిల జాషువాగారు చెప్పిన పిల్ల వస్తాదులా. నవ్వుతూ అతని చేతుల్లో ముందుకీ వెనక్కీవూగుతున్నది చాల ఉత్సా హంగా.

"పాలు పూర్తిగా తాగలేదు" అంటూ పాలసీసా ఆ పిల్ల నోట్లో పెట్టింది ఆయా.

అంటూనే, సీత చేతుల్లో నించీ సమీరని తీసుకుని, లోపలికి వెళ్ళింది.

శబ్దం చేస్తూ పాలు తాగుతున్నది ఆ పసికందు. కళ్ళు మాత్రం సీతాపతి మీదే వున్నాయి. నోట్లోంచీ కారుతున్న పాలని తువ్వాలతో తుడుస్తున్నాడు. పాల సీసాని పక్కకు నెడుతున్న పాపకి ఏవో సంజ్ఞలు చేస్తూ, ఆడిస్తూ మళ్ళీ ఆ చిన్న నోటికి అంది స్తున్నాడు. పెద్దగా నవ్వింది సీత.

"ఇదేమిటి సీతాపతీ! పిల్లని ఎత్తుకుంటున్నావ్, పాలు పడుతున్నావ్, నవ్విస్తు న్నావ్, నోరు తుడుస్తున్నావ్... నాకు తెలీకుండా ఇవన్నీ ఎప్పుడు నేర్చుకున్నావ్" అంది అతన్ని ఆట పట్టిస్తూ.

సీతాపతి కూడా నవ్వి, "అన్నివిషయాల్లోనూ ట్రైనింగ్ అక్కరలేదనీ, అవసర మైనప్పుడు అవే తెలుస్తాయనీ నా పెళ్ళాం ఈ మధ్య చెప్పినట్టు గుర్తు!"అన్నాడు.

పాలు తాగుతున్న ఆ పసిపాప సీతాపతి ఒడిలో పడుకుని అలాగే నిద్రపోయిం ది, అతని పొట్టకి హత్తుకుని.

ఆ పాప వీపు మీద చేయి వేసి, సీతతో "ఏమిటి లతలా అల్లుకు పోయింది!" అన్నాడు.

ఆ మరాఠీ ఆయాకి ఏమర్థమయిందో ఏమో, "అవును! ఈ పాప పేరులత!" అన్నది.

ఆ మాట విని సీత వెంటనే అంది "ఆ పిల్ల లతలా నీకు అల్లుకుపోలేదు. లత నీ స్వంత పిల్లలా నీకు హత్తుకుపోయింది"

"ష్! లత నిద్ర పోతున్నది. నెమ్మదిగా మాట్లాడు" అన్నాడు సీతాపతి, తన ముక్కు మీద వేలేసుకుని, సైలెన్స్ అంటున్న రావి కొండలరావ్‌లా.

"ఈ అమ్మాయే మన అమ్మాయి" అతన్ని చూస్తూ నెమ్మదిగా అంది సీత.

"అవును! లత మన అమ్మాయే!" అన్నాడు సీతాపతి కూడా.

వాళ్ళిద్దరికీ ఆ పిల్లే నచ్చింది.

అప్పుడే వచ్చాడు రెండేళ్ళ ఆ పిల్లాడు. వచ్చి లత పక్కనే నుంచున్నాడు. లతను చూపిస్తూ, వచ్చీ రాని హిందీలో "చెల్లి... లత... చెల్లి.." అంటున్నాడు. ఆ పిల్లాడు కూడా తెల్లగా అందంగా వున్నాడు. అంతేకాదు అతనికీ,లతకీ పోలికలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

శైలజా పాండే అంది "అవును! అరుణ్, లత అన్నాచెల్లెళ్ళు. అరుణ్‌కి రెండేళ్ళ వయసు"

అరుణ్ అక్కడే నుంచుని అవే మాటలు పదేపదే అంటున్నాడు. ఆ వయసులో వేరే మాటలేవీ ఇంకా రాలేదేమో కూడాను.

"అరె! వీళ్ళిద్దరికీ అమ్మా నాన్నా లేరా" అనబోయి, వాళ్ళే వుంటే ఈ పిల్లలెందుకు అక్కడ వుంటారనే ఆలోచన వచ్చి, ఏమీ అనలేదు సీతాపతి.

"ఎంత ముద్దొస్తున్నాడో" అంది సీత, కొంచెం నొచ్చుకుంటూ.

ఆ పిల్లల పుట్టు పూర్వోత్తరాలు దత్తు చేసుకోబోయే వారికి చెప్పటంఆ సంస్థ పాలసీ కాదు కనుక, శైలజ ఇక వివరాలేమీ చెప్పలేదు.

సీతా, సీతాపతీ కూడా ఆ విశేషాలు తెలుసుకోటానికి ఇష్ట పడలేదు కనుక, ఇక ఆ విషయం గురించి మాటలు రాలేదు.

కానీ శైలజ తన మనసులోని మాట చెప్పింది.

"మీరు లతను పెంచుకోవటానికి ఇష్టపడితే, అరుణ్‌నికూడా దత్తతచేసుకోవటానికి ఆలోచించమని కోరుతున్నాను. ఆ పసివాడికీ రోజు, ఈ ప్రపంచంలో తన అంటూ వున్నది లత మాత్రమే. చెల్లీ చెల్లీ అని వాడు, ఒక్కక్షణంకూడా వదలకుండా లత వెంబడే తిరుగుతుంటాడు ఎప్పుడూ...."

సీత ఒక్కసారిగా బిత్తరపోయి, సీతాపతిని చూసింది.

లత వీపు మీద మృదువుగా నిమురుతున్న అతని చేయి ఆగిపోయింది. అతను కూడా ఈ పరిణామానికి ఆశ్చర్యపోయినట్టు తెలుస్తూనే వుంది.

వాళ్ళిద్దరూ, ఒకరినొకరు తేరిపార చూసుకుంటుంటే, వాళ్ళ భావాలను అర్థం చేసుకున్న శైలజ అంది.

"ఇద్దర్నీ కలిపి దత్తత చేసుకోవాలనే నిబంధన ఏమీ లేదు. మీకు లత మాత్రమే కావాలంటే మీ ఇష్టం. అలాగే చేద్దాం. వాళ్ళిద్దరినీ విడదీయటం మంచిది కాదేమో అన్న ఉద్దేశ్యంతో మాత్రమే ఒక సలహాలా చెప్పాను"

సీత నెమ్మదిగా అన్నది సీతాపతితో. "ఆ పసిపిల్లకు ఏమీ తెలియక పోవచ్చు కానీ, అరుణ్‌కి ఇప్పుడిప్పుడే ఊహ తెలియటం మొదలయింది. చూస్తున్నాం కదా! లత అంటే ఎంత ప్రేమ చూపిస్తున్నాడో. అదీకాక ఎదిగిన మనుష్యులుగా మనం వాళ్ళని విడదీయటం మానవత్వం అనిపించుకోదు!"

"మరి ... మనకి ఇద్దరు పిల్లల్ని దత్తత చేసుకోవటం ఇష్టం లేదు కదా.....ఇద్దరు వద్దని గట్టిగా అనుకున్నాం కదా" సాలోచనగా అన్నాడు సీతాపతి.

సీత అంది "ఈ తర్జనభర్జనలు ఇక్కడ ఈవిడ ముందు ఎందుకు లెండి. మనం అనుకున్నట్టుగా ఆంధ్రా వెళ్ళి, ఆ స్థలం అమ్మకం అవగానే, వచ్చి మిగతా పేపర్ వర్క్ పూర్తిచేద్దాం. ఈలోగా మనం ఆలోచించుకుని, ఒక నిర్ణయానికి రావటానికి సమయం దొరుకుతుంది"

సీతాపతికి సీత చెప్పింది సబబుగానేవుంది. లేవబోయాడు కానీ, లత సీతాపతి చేతి వేలు గుప్పిటతో గట్టిగా పట్టుకుని, అతని ఒళ్ళో గాఢనిద్రలో వుండటం వల్ల, అలాగే కదలకుండా కూర్చున్నాడు కుర్చీలో. ఆ పిల్ల ముఖం, ఆ చిన్ని కళ్ళు మూసుకునే వున్నా, చిరునవ్వుతో నిర్మలంగా వుంది. అరుణ్, లత రెండో చేయి పట్టుకుని మెల్లగా నిమురుతున్నాడు.

సీత శైలజతో నెమ్మదిగా అంది. "మేం ముందే చెప్పినట్టుగా ఇవాళే బయల్దేరి ఆంధ్రా వెడుతున్నాము. అక్కడ పనులు పూర్తిచేసుకుని తిరిగి వచ్చాక, మిగతా పని పూర్తి చేద్దాం"

"అలాగే.... మీకెలా కావాలంటే అలాగే చేద్దాం" అంది శైలజ లేస్తూ. ఇద్దరికీ నమస్కారం చేసి, సీతాపతి చేతుల్లోనించీ లతను అందుకుంది.

సీతాపతి లత ముఖంలోకి ప్రేమగా చూసి, సీతతో బయటికి బయల్దేరాడు.

అరుణ్ గబగబా వచ్చి, సీత చేయి గట్టిగా పట్టుకుని, ఏవేవో అర్థం కాని మాటలు అంటున్నాడు. అతని మాటలు అర్థం కాకపోయినా, చిన్న పిల్లల ఆటల్లో వాళ్ళ

బొమ్మలు ఎవరన్నాలాక్కుంటే, వాళ్ళ హావభావాలెలా వుంటాయో అవి కనిపించాయి సీతకి. అతని తల మీద చేయి వేసి, ఆప్యాయంగా నిమిరింది.

* * *

ఆ తర్వాత పదిరోజులూ, సీతా సీతాపతీ సరిగ్గా నిద్రపోలేదు.

వాళ్ళ ఆలోచనలు టెన్నిస్ ఆటలో బంతిలా, ఇటునించీ అటూ, అటునించీ ఇటూ తిరుగుతూనే వున్నాయి. కానీ ఒక గట్టి నిర్ణయం మాత్రం తీసుకోలేకపోయారు

రీశెర్చిలో పూర్తిగా మునిగిపోయినందున, ప్రొద్దున ఎనిమిది గంటలకు వెళ్ళి, మళ్ళీ రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటలకే ఇంటికి రావటం. అన్ని శనివారాలూ, కొన్ని ఆదివారాలు కూడా, వాళ్ళు గడిపేది లాబ్ లోనే. అందుకే ఇద్దరు పిల్లల్ని సవ్యంగా పెంచటం దాదాపు అసాధ్యమనిపించింది.

అలాగని, ఆ పసికందులని విడదీయటం వాళ్ళు చేయలేని పని.

సీతలోనూ, సీతాపతిలోనూ అమాయకంగానూ, అందంగానూ వున్న సమీర ముఖం మెదులుతూనేవున్నా, లత పాలబుగ్గల మధ్య చిరునవ్వు వెంటాడుతూనే వుంది. తన ఒడిలో వెచ్చగా పడుకుని నిద్రపోయిన ఆ పసితనం, పసిడితనం సీతాపతి మనసులో శాశ్వతంగా ముద్ర వేశాయి. సీతకి అరుణ్ తన చేతిని ఇంకా గట్టిగా పట్టుకున్నట్టే అనిపిస్తున్నది.

పదిరోజుల్లో వద్దామనుకున్న వాళ్ళు, స్థలం రిజిస్ట్రేషన్ అవటం ఆలస్యమవటం వల్ల, మళ్ళీ పూనా రావటానికి పదిహేను రోజుల పైన అయింది.

శైలజా పాండే నవ్వుతూ ఎదురు వచ్చి, "ఇన్నాళ్ళూ మీరేమయిపోయారో అర్థం కాలేదు. మీరిచ్చిన ఫోన్ నెంబర్ కూడా పని చేస్తున్నట్టు లేదు" అంది.

"మీరు అనుకున్న ఆ పాపకి వారం రోజుల క్రితం జలుబూ జ్వరం వచ్చినా, ఇప్పుడు తగ్గిందిలెండి" అంది.

"ఎవరికి? లతకా?" అడిగాడు సీతాపతి.

"కాదు. సమీరకి. అవును మీకు చెప్పలేదు కదూ. ఇండియాలోనే తమిళ్‌నాడులో ఒకాయన వున్నాడు. ఫరవాలేదు. కాస్తో కూస్తో డబ్బున్నవాడే. ఆయనా, ఆయన భార్యా వయసులో పెద్దవాళ్ళే. వాళ్ళ పిల్లలు పెద్దవాళ్ళయి, పెళ్ళిళ్ళు చేసుకుని విదేశాలకు వెళ్ళిపోయాక, వాళ్ళు మళ్ళీ ఒంటరి వాళ్ళయిపోయారు. మా దగ్గరకు వచ్చి ఒక బాబుయిని పెంచుకోవాలనుకున్నారు. చాలరోజుల నించీ, మామధ్య ఉత్తరాలు, టెలిఫోన్ కాల్సూ నడుస్తూనే వున్నా, పదిరోజుల క్రితమే ఇక్కడికి వచ్చారు. ఇక్కడ చూసిన అందరిలోకీ వాళ్ళకి బాగా నచ్చింది ఎవరో తెలుసా? అరుణ్. వాడికి వాళ్ళతో వెళ్ళ

టం ఇష్టమయింది కానీ ఒంటరిగా కాదు. వాడి చెల్లెలితో కలిసి వెళ్ళాలని. చెల్లెలి మీద వాడి ప్రేమ చూసి వాళ్ళ మనసు కరిగిపోయింది. ముందర ఒక్క పిల్లాడే కావాలనుకున్న వాళ్ళు, అరుణ్‌నీ లతనీ, ఇద్దరినీ కలిసి పెంచుకుంటానన్నారు. పేపర్ వర్క్‌కూడా అయిపోయింది" శైలజ ఇంకా ఏదో అంటున్నది.

సీతా, సీతాపతీ ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు.

తేరుకుని "కాగల కార్యం గంధర్వులే తీర్చారు" అంది సీత నీరసంగా.

"ఇద్దరూ రిటైరయిన వాళ్ళూ, ఇంతకు ముందు పిల్లల్ని పెంచిన అనుభవం వున్నవాళ్ళు కనుక, అరుణ్ లతా అక్కడ సుఖంగా వుంటారు. చక్కగా పెరుగుతారు. అంతకన్నా మనం కోరుకునేదేముంది!" అన్నాడు సీతాపతి.

ఆయా సమీరను ఎత్తుకుని తీసుకువచ్చి, సీతకి అందించింది.

తన పెద్దపెద్ద కళ్ళను ఇంకా పెద్దవి చేసి, సీతను చూస్తూ, నోట్లో వేలు పెట్టుకుని శబ్దాలు చేస్తున్నది సమీర.

ఆ మెత్తటి చిన్న చేతిని పట్టుకుని మృదువుగా ఒత్తాడు సీతాపతి.

సీతాపతి కళ్ళల్లోకి అందంగా చూసి, తన ఎత్తు బుగ్గల మధ్య నించీ, పౌర్ణమి నాటి వెన్నెల్లో చందమామలా, ఒక చక్కటి చిరునవ్వుని అందించింది సమీర.